సాక్షి చిత్తూరు

సోమవారం ၊ 28 ၊ ఏప్రిల్ ၊ 2025



ప్రమాదాలపై ఫోకస్

రోడ్డు ప్రమాదాలకు అడ్డుకట్ట వేసేందుకు కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ ప్రత్యేక దృష్టి సారించి దిశానిర్దేశం చేస్తున్నారు. - 8లో



..దొంగల బీభత్సం

బంగారుపాళెం మండలం సంక్రాంతిపల్లెలో ఆదివారం అర్ధరాత్రి దొంగలు ఘరాన దోపిడీకి పాల్పడ్డారు. - 8లో



.. మృతదేహంతో ఆందోళన

గంగవరం మండలంలో విద్యార్థి మృతదేహం తో ఆదివారం కళాశాల ఎదుట రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. - 8లో

న్యూస్‌రీల్

నేడు పోలీసు గ్రీవెన్స్

చిత్తూరు అర్బన్ : చిత్తూరు వన్‌టౌన్ పక్కన ఉన్న ఆర్మ్‌డు రిజర్వు కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎస్పీ మణికంఠ చందోలు తెలిపారు. ఉదయం 10.30 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.

నేడు పలమనేరులో గ్రీవెన్స్

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజల సమస్యల పరిష్కారం కోసం సోమవారం పలమనేరు మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ తెలిపారు. పలమనేరు రెవెన్యూ డివిజన్‌లోని ప్రజా సమస్యల పరిష్కారానికి సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

30న డీఆర్‌సీ వాయిదా

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని జెడ్పీ సమావేశ మందిరంలో ఈనెల 30వ తేదీన నిర్వహించాల్సిన డీఆర్‌సీ (జిల్లా అభివృద్ధి సమీక్షా కమిటీ సమావేశం)వాయిదా వేశారు. ఈ సమావేశాన్ని పలు కారణాల చేత వాయిదా వేసినట్లు కలెక్టరేట్ అధికారులు చెప్పారు.

ఇద్దరు ఉద్యోగుల సస్పెన్షన్

– మరొకరిపై కేసు నమోదుకు ఆదేశం

చిత్తూరు కార్పొరేషన్ : వి.కోట పంచాయతీలో రూ.50 లక్షలు నిధులు దుర్వినియోగమయ్యాయి. అందుకు కారకులైన ఇద్దరు పంచాయతీ సిబ్బందిని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాల మేరకు డీపీఓ సుధాకర్‌రావు సస్పెండ్ చేశారు. ప్రస్తుత పాలకల పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ యాదవపతి గతంలో డిప్యూటేషన్‌పై వి.కోట పంచాయతీ ఇన్‌చార్జి ఈఓగా విధులు నిర్వహించారు. అతడితో పాటు ఆ పంచాయతీ బిల్లు కలెక్టర్ పృథ్వీ, మరొక కాంట్రాక్ట్ ఉద్యోగితో కలిసి ప్రజలు చెల్లించిన పన్నులు, పన్నేతర నిధులను పంచాయతీ ఖాతాకు జమ చేయకుండా రూ.1.50 కోట్లు దుర్వినియోగం చేసినట్లు స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై డీఎల్‌పీఓ స్థాయి అధికారి విచారణ చేయించారు. రూ.50 లక్షలు పక్కదారి పట్టినట్లు నిర్ధారించారు. ఇందులో యాదవపతి రూ.16 లక్షలు, పృథ్వీ రూ.34 లక్షలు వారి సొంతానికి వాడుకున్నట్లు విచారణలో వెల్లడైంది. నిధుల దుర్వినియోగానికి పాల్పడిన కారణంగా వారిని సస్పెండ్ చేసినట్లు డీపీఓ తెలిపారు. ఈ విషయంలో బాధ్యుడిగా గుర్తించిన కాంట్రాక్ట్ ఉద్యోగిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని పంచాయతీ కార్యదర్శికి డీపీఓ ఆదేశించారు.



కుప్పం పట్టణం ఏరియల్ వ్యూ

కుప్పంలో.. ఉత్కంఠ

కుప్పం మున్సిపల్ చైర్మన్ ఎన్నిక రాష్ట్ర వ్యాప్తంగా ఉత్కంఠ రేపుతోంది. సాక్షాత్తు సీఎం చంద్రబాబు సొంత నియోజకవర్గం కావడంతో ప్రజానీకం మొత్తం కుప్పం వైపే చూస్తోంది. పట్టు నిలుపుకునేందుకు వైఎస్సార్‌సీపీ పోరాడుతుండగా.. బలం లేకపోయినా బరితెగించేందుకు టీడీపీ సిద్ధమైంది. ఇందులో భాగంగానే ఎత్తుకు పైఎత్తులు వేస్తోంది. కుట్రలు, కుతంత్రాలు, ప్రలోభాలకు తెర లేపుతోంది. నేడు జరగనున్న చైర్మన్ గిరి ఎన్నికలో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లను పాల్గొనకుండా అడ్డుకునేందుకు విశ్వప్రయత్నాలు చేస్తోంది. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టింది.

నేడు కుప్పం మున్సిపల్ చైర్మన్ ఎన్నిక

- సంపూర్ణ మెజారిటీతో ఊపుమీదున్న వైఎస్సార్‌సీపీ
- బలం లేకపోయినా బరితెగించేందుకు సిద్ధమైన టీడీపీ
- వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు ఓటింగ్‌కు రానీయకుండా కుయుక్తులు
- ఇప్పటికే ఆరుగురిని తమవైపు తిప్పకున్న కూటమి
- ఎలాగైనా చైర్మన్ గిరి దక్కించుకోవాలని కుట్రలు
- ఎన్నికకు సర్వం సిద్ధం చేసిన అధికారులు

కుప్పం రూరల్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రజలు ఎదురు చూస్తున్న రోజు రానే వచ్చింది. 2024 నవంబర్ నుంచి ఖాళీగా ఉన్న కుప్పం మున్సిపల్ చైర్మన్ ఎన్నికకు సమయం ఆసన్నమైంది. సోమవారం జరగనున్న ఈ ఎన్నికకు రిటర్నింగ్ అధికారిగా కుప్పం ఆర్డీఓ శ్రీనివాసరాజు, అబ్జర్వర్‌గా జాయింట్ కలెక్టర్ విద్యాధరిని ప్రభుత్వం నియమించింది. చైర్మన్ అభ్యర్థి గెలుపునకు కావాల్సిన బలం వైఎస్సార్‌సీపీకి ఉన్నా.. అధికార బలంతో ఎలాగైనా చైర్మన్ కుర్చీని దక్కించుకోవాలని కూటమి ప్రభుత్వం శతవిధాలా ప్రయత్నిస్తోంది.

సమాయత్తమైన ఇరుపార్టీలు

సంఖ్యా పరంగా చూసుకుంటే వైఎస్సార్‌సీపీనే గెలవాలి. కానీ అధికార పార్టీ కుతంత్రాలకు దిగింది. 2021లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ 19 మంది కౌన్సిలర్లతో విజయఢంకా మోగించింది. టీడీపీ ఆరుగురు కౌన్సిలర్లకే పరిమితమైంది. కుప్పం మున్సిపల్ చైర్మన్‌గా డాక్టర్ సుధీర్ కొనసాగారు. కుటమి ప్రభుత్వం రావడంతో ఆయన తన పదవికి రాజీనామా చేసి టీడీపీలో చేరారు. అలాగే మరో నలుగురు కౌన్సిలర్లు టీడీపీలో చేరిపోయారు. దీంతో కౌన్సిల్లో టీడీపీ బలం పదికి పెరిగింది. ప్రస్తుతం గెలవాలంటే మరో నలుగురు అభ్యర్థులు అవసరం. బలం లేకపోయినా టీడీపీ బరితెగిస్తోంది. వైఎస్సార్ సీపీ అభ్యర్థులను అంగడి సరుకులా కొనేందుకు సిద్ధమైంది. ఇప్పటికే వీరి వల లో నలుగురు కౌన్సిలర్లు చిక్కుకోగా, మరో ఇద్దరు ఓటింగ్‌లో పాల్గొనకుండా భయపెట్టినట్టు తెలిసింది. ఇలా జరిగితే టీడీపీ గెలుపు ఖాయమనిపిస్తోంది. వైఎస్సార్ సీపీ మాత్రం ప్రజాస్వామ్యపై నమ్మకంతో ఎన్నికల బరిలో దిగుతోంది.

సంప్రదాయాన్ని పాటించరా?

వైఎస్సార్ సీపీ 2019లో అధికారం చేపట్టగానే టీడీపీ నుంచి 12 మంది ఎమ్మెల్యేలు స్వచ్ఛందంగా వైఎస్సార్ సీపీలోకి వచ్చేందుకు సుముఖత చూపారు. అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మాత్రం వారిని తమ పదవులకు, పార్టీకి రాజీనామా చేసి రావాలని షరతు విధించారు. ఇదే సంప్రదాయాన్ని కుప్పం మున్సిపల్ కౌన్సిలర్ల విషయంలోనూ టీడీపీ అధిష్టానం పాటించాలని కుప్పం జనం సూచిస్తున్నారు. తమ వైపునకు తిప్పుకున్న కౌన్సిలర్ల చేత రాజీనామాలు చేయించి, గెలిచిన తరువాత చైర్మన్ ఎన్నిక నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు.



కుప్పం మున్సిపాలిటీ

బలం లేకపోయినా బరితెగింపే!

5 నవంబర్, 2024 వరకు మున్సిపల్ చైర్మన్‌గా కొనసాగిన 16వ వార్డు కౌన్సిలర్ డాక్టర్ సుధీర్ వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేశారు. అప్పటి నుంచి చైర్మన్ కుర్చీ ఖాళీగా ఉంది. ఎన్నికల సంఘం ఏప్రిల్ 28న మున్సిపల్ చైర్మన్ ఎన్నిక తేదీని ప్రకటించింది. 25 వార్డులు ఉన్న కుప్పం మున్సిపాలిటీలో డాక్టర్ సుధీర్ రాజీనామాతో ఆ సంఖ్య 24కు చేరింది. వీరికి ఎక్స్ అఫిషియో సభ్యులుగా స్థానిక ఎమ్మెల్యే చంద్రబాబు, ఎమ్మెల్సీలు కంచెర్ల శ్రీకాంత్, భరత్‌కు ఓటు హక్కు ఉంది. దీంతో సభ్యుల సంఖ్యా బలం 27కు చే రింది. ఇందులో చంద్రబాబు వచ్చే అవకాశాలు త క్కువగా ఉండడంతో 26 మంది సభ్యులతోనే ఎన్నిక నిర్వహించనుంది. 14 మంది అభ్యర్థులు ఎవరికి మ ద్దతు ఇస్తే వారే చైర్మన్ గిరిని దక్కించుకునే అవకాశం ఉంది. ఈ మేరకు కుప్పం ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఏర్పాటు పూర్తి చేశారు.

చైర్మన్ గిరి కోసం కుమ్ములాట!

కుప్పం: 'ఆలూలేదు.. చూలూ లేదు.. కొడుకు పేరు సోమలింగం' అన్నట్టు తయారైంది కుప్పం మున్సిపల్ చైర్మన్ ఎన్నికల్లో టీడీపీ పరిస్థితి. వైఎస్సార్‌సీపీకి సంపూర్ణ బలం ఉండడంతో ఆ పార్టీకి విజయావకాశాలు నల్లేరుపై నడకేనని విశ్లేషకులు చెబుతున్నారు. అయితే బలం లేకపోయినా.. బరితెగించి కుప్పం చైర్మన్ గిరిని తన్నుకుపోవాలని టీడీపీ కాచుకు కూర్చొంది. ఈ క్రమంలోనే 19, 20, 5 వార్డుల కౌన్సిలర్లు దామోదరం, సోమశేఖర్, సెల్వరాజు చైర్మన్ కుర్చీ కోసం పోటీపడుతున్నట్టు తెలుస్తోంది. శనివారం రాత్రి హొసూరు సమీపంలో క్యాంప్‌లో ఉన్న టీడీపీ మద్దతుదారుల మధ్య వివాదం రేగి, కుమ్ములాటలకు దారితీసినట్టు సమాచారం.

వైఎస్సార్‌సీపీ చైర్మన్ అభ్యర్థిగా హాఫీజ్

వైఎస్సార్‌సీపీ చైర్మన్ అభ్యర్థిగా అధిష్టానం 9వ వార్డు కౌన్సిలర్ ఎస్‌డీ.హాఫీజ్‌ను ఎంపిక చేసింది. ప్రత్యామ్నాయంగా 2వ వార్డు కౌన్సిలర్ ఆర్.మునిరాజును కూడా నియమించింది. ఇందుకు సంబంధించిన విప్‌ను అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు కరుణాకరరెడ్డికి అందజేశారు. ఆయన కౌన్సిల్లోని 2వ వార్డు కౌన్సిలర్ ఆర్.మునిరాజుకు విప్ జారీ అధికారాన్ని కట్టబెట్టారు. రక్షణ కోసం హైకోర్టును ఆశ్రయించారు.



రక్షణ కల్పించాలని కోర్టు ఆదేశాలను స్థానిక పోలీసులకు చూపుతున్న వైఎస్సార్ సీపీ నేతలు

సర్వం సిద్ధం

కుప్పం చైర్మన్ ఎన్నిక సోమవారం ఉదయం 11 గంటలకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించనున్నారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. కోరం ప్రకారం 14 మంది సభ్యులు హాజరైతే అధికారులు ఎన్నిక జరిపే అవకాశం ఉంది. కోరం లేని పక్షంలో అధికారులు చైర్మన్ ఎన్నికను వాయిదా వేయొచ్చని సమాచారం. రామకుప్పం ఎంపీపీ ఎన్నిక తరహాలో ప్రత్యేక జీఓ పాచిక ప్రయోగిస్తారా? అనేది వేచి చూడాల్సి ఉంది.

విజయానందం

టీడీపీ ప్రభుత్వంలో నిర్వీర్యమైపోయిన విజయా డెయిరీకి గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రాణం పోశారు.. గత విజయా డెయిరీ రూ.182 కోట్ల బకాయిలను చెల్లించి దేశంలోనే విజయవంతం అయిన అమూల్ డెయిరీతో వైఎస్ జగన్ ప్రభుత్వం అప్పట్లో ఒప్పందం చేసుకుంది. ఆ ఒప్పందం ఫలితంగా నేడు అమూల్ డెయిరీ తొలి దశ పనులను శరవేగంగా చేపట్టింది..రోజుకు లక్ష లీటర్ల పాల సేకరణ, ప్యాకింగ్ జరుగుతోంది. ఇప్పటికే 200 మంది స్థానికులకు ఉపాధి దక్కింది. మరికొద్ది రోజుల్లో డెయిరీ వంద శాతం పనులు పూర్తయితే 500 మంది నిరుద్యోగులకు ఉపాధి లభించనుంది. ఫలితంగా జిల్లా విజయా డెయిరీకి పూర్వవైభవం వచ్చినట్లే..

- టీడీపీ ప్రభుత్వంలో విజయా డెయిరీ మూత
- వైఎస్సార్‌సీపీ హయాంలో పునరుజ్జీవం
- అమూల్‌కు అప్పగింత
- మాజీ సీఎం వైఎస్ జగన్ చేతుల మీదుగా శంకుస్థాపన
- అమూల్ ఆధ్వర్యంలో డెయిరీ కల సాకారమవుతున్న వేళ
- ప్రారంభమైన డెయిరీ సేవలు



కొత్త శోభను సంతరించుకుంటున్న విజయా డెయిరీ

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : టీడీపీ ప్రభుత్వంలో విజయా డెయిరీ నిర్వీర్యమైంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతో విజయా డెయిరీ పునరుజ్జీవం పోసుకుంది. ఎన్నికల హామీ మేరకు విజయా డెయిరీని అమూల్‌కు అప్పగిస్తూ అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేసుకుంది. ప్రస్తుతం డెయిరీ కల సాకారమవుతోంది. జోరుగా డెయిరీ అభివృద్ధి పనులు జరుగుతూనే..పాలు, మజ్జిగ తయారీ ఉత్పత్తి ప్రారంభమైంది. త్వరలో పాల ఉత్పత్తులు ప్రారంభం కానున్నాయి. వచ్చే ఏడాది నుంచి ఐస్‌క్రీమ్ తయారీకి సన్నాహాలు జోరుగా సాగుతున్నాయి. దీంతో పలువురి ఉపాధికి బాసటగా నిలుస్తోంది.

విజయా డెయిరీ గత చరిత్ర ఇదీ..

చిత్తూరు నగరంలో 1969లో సహకార కార్పొరేషన్ ఆధ్వర్యంలో విజయా డెయిరీ ప్రారంభమైంది. అప్పట్లోనే 3 వేల లీటర్ల పాలను సేకరించి జిల్లా వ్యాప్తంగా విక్రయించేవారు. 1977–78 నుంచి తిరుమల స్వామివారి అభిషేకానికి కూడా విజయా డెయిరీ పాలను సరఫరా చేసేవారు. ఆ తర్వాత పాల అమ్మకాలు పుంజుకున్నాయి.1980 నాటికి రోజుకు 50 వేల లీటర్ల పాల సేకరణ సామర్థ్యం పెరగడంతో పాలకోవా, రోస్‌మిల్క్ తయారు చేసే యూనిట్లను ఏర్పాటు చేసింది. మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ ప్రభుత్వ ప్రోత్సాహంతో తిరుమలకు నెలకు రూ.కోటి మేరకు నెయ్యి సరఫరా చేశారు. పాల పౌడర్‌ను మిలిటరీ క్యాంటీన్లకు సరఫరా చేసేవారు. ఇలా డెయిరీ సామర్థ్యం మరింత పెరగడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 1.20 లక్షల పాడి రైతు కుటుంబాలు రోజుకు దాదాపు 3.50 లక్షల లీటర్ల పాలను సరఫరా చేసి జీవనం సాగించేవారు. ఆ తర్వాత పలు ప్రాంతాల్లో శీతలీకరణ కేంద్రాలు ఏర్పాటయ్యాయి. రోజుకు 4 లక్షల లీటర్ల మేరకు పాల సేకరణ జరిగేది. డెయిరీ నుంచి ఢిల్లీ, పూణే, ముంబయి తదితర మహా నగరాలకు రోజుకు 2 లక్షల లీటర్ల పాలను రేణిగుంట నుంచి రైలు ద్వారా తరలించేవారు.

జోరుగా అభివృద్ధి పనులు

శంకుస్థాపన రోజు నుంచి అమూల్ సంస్థ డెయిరీ పునరుద్ధరణ పనులను వేగవంతంగా చేపడుతోంది. ఇప్పటికే తొలిదశ పనులు పూర్తి కావస్తున్నాయి. మరో దశ పనులను ప్రారంభించేలా సంస్థ ముందడుగు వేస్తోంది. ఇప్పటికే పాల సేకరణతో పాటు పాలు, మజ్జిగ తయారీ, ప్యాకింగ్ ప్రక్రియను మొదలు పెట్టింది.

ప్రస్తుతం రోజుకు లక్ష లీటర్ల పాలసేకరణ

ప్రస్తుతం 2 లక్షల లీటర్ల పాల తయారీ సామర్థ్యం ఇక్కడ ఉంది. అయితే ప్రస్తుతం రోజుకు లక్ష లీటర్ల పాలు సేకరణ జరుగుతోంది. మరో రెండు నెలల తర్వాత సేకరణ అధికం కావచ్చని సంస్థ నిర్వాహకుల అంచనా. అలాగే 50 టన్నుల పెరుగు టార్గెట్‌ను అధిగమించారు. దీంతో మరో 50 టన్నుల కోసం కొత్తలైన్ ఏర్పాటు చేస్తున్నారు.

మే నుంచి పాల ఉత్పత్తులు

మే నుంచి 5 టన్నుల పన్నీర్, నెయ్యి తయారీ జరగనుంది. జూన్‌లో కేక్‌లు, పలు తినుబండరాలు తయారు కానున్నాయి. డిసెంబర్‌లో 5 వేల కేజీల యోగర్ట్ తయారీకి సన్నద్ధమవుతున్నారు. వచ్చే ఏడాదిలో ఐస్ క్రీమ్ ఉత్పత్తులు తయారీ చేయనున్నారు. కాగా ఇప్పటికే 200 మందికి ఉపాధి అవకాశాలు క ల్పించారు. వంద శాతం స్థానికులకే అవకాశం కల్పిస్తున్నారు. వచ్చే ఏడాదిలో 500 మందికి ఉపాధి దక్కనుంది. వంద శాతం డెయిరీ పనులు పూర్తయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యం మేరకు నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

టీడీపీ ప్రభుత్వంలో నిర్వీర్యం

చంద్రబాబు నాయుడు సహకార శాఖ మంత్రిగా పని చేస్తున్న సమయంలో విజయా డెయిరీని సందర్శించారు. అప్పటి పాల సేకరణ, ఉత్పత్తిపై లోతుగా విచారణ చేపట్టారు. ఆ తర్వాత విజయా డెయిరీకి కష్టాలు మొదలయ్యాయని చెబుతుంటారు. తొలుత పాల పౌడర్ , నెయ్యి అమ్ముడుపోకుండా చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఆ తర్వాత నష్టాల్లో ఊబిలోకి నెట్టారనే విమర్శలు ఉన్నాయి. నష్టాల పేరుతో పాలను సొంత డెయిరీకి మళ్లించినట్లు ఆరోపణలున్నాయి. ఆఖరికి నష్టాలను చూపి 2002 ఆగస్టు 31న డెయిరీని పూర్తిగా మూసివేశారు. దీంతో డెయిరీని నమ్ముకుని జీవనం సాగిస్తున్న రైతులు రోడ్డున పడ్డారు.

ఎన్నికల హామీ మేరకు..

మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2018లో చిత్తూరు జిల్లాలో పర్యటించారు. ఈ క్రమంలో రైతులు, విజయా డెయిరీ కార్మికులు డెయిరీ దుస్థితిని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వారి వినతి మేరకు డెయిరీని తెరిపించేలా హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం ఆయన అధికారంలోకి వచ్చిన వెంటనే డెయిరీ పునః ప్రారంభానికి చర్యలు తీసుకున్నారు. డెయిరీ పేరుతో ఉన్న రూ.182 కోట్ల బకాయిలను చెల్లించారు. రూ.385 కోట్లతో డెయిరీ అభివృద్ధికి ముందుకు వచ్చిన అమూల్ సంస్థతో గత ప్రభుత్వం 99 ఏళ్ల పాటు లీజుకు ఒప్పందం కుదుర్చుకుంది..

జగన్ చేతుల మీదుగా అమూల్‌కు శంకుస్థాపన

విజయా డెయిరీని పునరుద్ధరణలోకి తీసుకొస్తూ 2023 జులై5వ తేదీన అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. అప్పట్లో తొలిదశగా రూ.150 కోట్లతో చిత్తూరు డెయిరీ పనులను మొదలు పెట్టాలని నిర్ణయం తీసుకున్నారు. ఆపై దశల వారిగా మరింత అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. పాల సేకరణతో పాటు దశల వారిగా బటర్, పాలపొడి, యూహెచ్‌టీ పాల విభాగం, ఛీజ్, పనీర్, యోగర్ట్, స్వీట్ తయారు చేసేలా ప్రణాళికలు చేసుకున్నారు. ఇలా సంస్థ ప్రణాళిక ప్రకారం 8 ఏళ్లల్లో 10 లక్షల లీటర్ల ప్రాసెస్ చేసే స్థాయికి తీసుకెళ్లాలని ప్రణాళికలు రూపొందించారు. పూర్తి స్థాయిలో పనులు పూర్తయితే 5 వేల మందికి ప్రత్యక్షంగా ఇక్కడే ఉద్యోగాలు లభించేలా చేయాలనే సంకల్పంతో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఈ డెయిరీకి పునరుజ్జీవం పోశారు.



వైఎస్ జగన్ ప్రారంభించిన శిలాఫలకం (ఫైల్)

పూర్వవైభవం తెస్తున్నారు..



విజయా డెయిరీ ఓ వెలుగు వెలిగింది. అలాంటి డెయిరీకి మాజీ ముఖ్యమంత్రి జగన్ పూర్వ వైభవం తీసుకొచ్చారు. క్షీర సంపద భవిష్యత్తులో ప్రధాన ఆర్థిక వనరు అని గుర్తించిన జగనన్న.. రైతులకు లబ్ధి చేకూర్చేందుకు జిల్లాలో మూతబడిన విజయ డెయిరీ స్థానంలో దేశంలోనే అగ్రగామిగా పేరుపొందిన అమూల్ డెయిరీ ఏర్పాటు చేశారు. దీని వల్ల రైతులకు మంచి జరుగుతుంది. ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయి. నిరుద్యోగులకు ఉపాధి దొరుకుతుంది.

– ఏకాంబరం, పాడిరైతు, యాదమరి

మళ్లీ పాతరోజులు గుర్తుకొస్తున్నాయి



పాడుబడిన ఫ్యాక్టరీ మళ్లీ లేసి నిలబడినట్లు ఉంది. అమూల్‌కు ఇవ్వడం వల్ల ఈ రోజు ఇలా చూసుకుంటున్నాం. స్థానికంగానే ఉద్యోగాలు ఇస్తున్నారు. మాకు ఉద్యోగం లేకున్నా ఎవరో ఒకరు బతుకుతున్నారు. పూర్తి స్థాయిలో పనులు పూర్తయితే మరికొంత మందికి పనులు దొరుకుతాయని ఆశిస్తున్నాం. మళ్లీ విజయా డెయిరీ జ్ఞాపకాలు గుర్తుకొస్తున్నాయి.

– రామచంద్ర, విజయా డెయిరీ ఉద్యోగి, చిత్తూరు

నాబిడ్డకంటే పార్టీ ముఖ్యం కాదు

- జిల్లా ఆస్పత్రిలో అందని వైద్యం
- వైద్యం కోసం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లకండి
- న్యాయం జరిగేంత వరకు రాజీలేని పోరాటం చేస్తా
- బీసీ నాయకుడు షణ్ముగం



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ నాయకుడు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): 'చిత్తూరులోని ప్రభుత్వ ఆస్పత్రిలో సరైన వైద్యం అందడం లేదు. ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. చిన్న జబ్బు అయినా ఆ ఆస్పత్రికి వెళ్లొద్దు' అని బీసీ సంఘం, టీడీపీ నాయకుడు షణ్ముగం తెలిపారు. ఆయన ఆదివారం చిత్తూరు నగరంలోని బీసీ సంఘ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. అక్కడి డాక్టర్ల నిర్లక్ష్యంతోనే తన బిడ్డ శ్రీదుర్గ మృతి చెందిందని ఆరోపించారు. బిడ్డ మృతికి అక్కడి వైద్యులే కారకులన్నారు. దీనిపై న్యాయ పోరాటం చేస్తానన్నారు. రాష్ట్ర స్థాయి అధికారులు, మెడికల్ కౌన్సిల్, రాష్ట్ర వైద్యశాఖ మంత్రికి ఫిర్యాదు చేస్తానని పేర్కొన్నారు. కానీ పక్షంలో ప్రాణత్యాగానికైనా సిద్ధమన్నారు. నా బిడ్డకంటే పార్టీ ముఖ్యం కాదని వివరించారు. సోమవారం నుంచి ప్రజాయాత్ర మొదలవుతుందని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు నాయుడి ఆశయం నీరుగారిందన్నారు. చిన్న జబ్బు వచ్చినా చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లకండని పిలుపునిచ్చారు. సమావేశంలో బీసీ నాయకులు రవీంద్రరాజు, రుద్రయ్య ప్రతాప్, హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ నాయకులు శోభారాణి, సాధిక్ తదితరులు పాల్గొన్నారు.

బోయకొండ..కిటకిట

చౌడేపల్లె : పుణ్యక్షేత్రమైన శ్రీ బోయకొండ గంగమ్మ ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. అమ్మవారి దర్శనం కోసం ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అర్చకులు అమ్మవారిని బంగారు ఆభరణాలతో సుందరంగా ముస్తాబు చేశారు. కోరిన కోర్కెలు తీరిన భక్తులు అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో ఒక్కసారిగా భక్తుల రద్దీ పెరగడంతో క్యూలైన్లు రద్దీగా మారిపోయాయి. పది, ఇంటర్ ఫలితాలు రావడంతో విద్యార్థులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఈఓ ఏకాంబరం ఆధ్వర్యంలో భక్తులకు ఉచిత తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఎలాంటి సంఘటనలు తలెత్తకుండా సీఐ రాంభూపాల్ ఆధ్వర్యంలో పోలీసులు నిఘా ఏర్పాటు చేశారు.



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



ఆలయంలో భక్తుల రద్దీ

కారు ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు



గాయపడిన జ్యోతీశ్వర్

పెద్దపంజాణి: మండలంలోని పలమనేరు–పుంగనూరు రోడ్డు ముత్తుకూరు క్రాస్ వద్ద ఆదివారం సాయంత్రం ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొనడంతో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని కొళత్తూరు పంచాయతీ గల్లావారిపల్లికి చెందిన వెంకటరమణ కుమారుడు జ్యోతీశ్వర్ మదనపల్లిలోని ఓ హోటల్‌లో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో స్వగ్రామం నుంచి మదనపల్లికి ద్విచక్ర వాహనంలో బయలుదేరాడు. ముత్తుకూరు క్రాస్ వద్ద పుంగనూరు నుంచి పలమనేరు వెళుతున్న కారు ఢీకొంది. తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితికి చేరుకున్న జ్యోతీశ్వర్‌ను స్థానికులు 108లో పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు మదనపల్లి ఏరియా ఆస్పత్రికి రెఫర్ చేశారు.

ఈతకెళ్లిన విద్యార్థి మృతి



తేజేష్‌రెడ్డి (ఫైల్)

బైరెడ్డిపల్లె: స్నేహితులతో కలిసి సరదాగా ఈతకెళ్లిన విద్యార్థి మృతి చెందిన సంఘటన మండల సమీపంలోని కర్ణాటక రాష్ట్రం సనిగపల్లెలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు..మండలంలోని గంగినాయనపల్లెకు చెందిన వెంకటరమణరెడ్డి కుమారుడు తేజేష్‌రెడ్డి (10) బైరెడ్డిపల్లెలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నాడు. వేసవి సెలవులు రావడంతో అమ్మమ్మ గ్రామమైన సనిగపల్లెకు వెళ్లాడు. అక్కడ గ్రామ సమీపంలోని చెరువులో ఈత కొడుతుండగా ప్రమాదవశాత్తు మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువచ్చారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ప్రమాదాలపై ఫోకస్



బ్లాక్‌స్పాట్‌గా చిత్తూరుకు సమీపంలోని మురకంబట్టు కూడలి



మొగిలి ఘాట్ రోడ్డు వద్ద ప్రమాదాల నివారణకు ఏర్పాటు చేసిన స్పీడ్‌బ్రేకర్లు

బంగారుపాళ్యం మండలం మొగిలిఘాట్ వద్ద 2024 సెప్టెంబర్ 13వ తేదీన ఆర్టీసీ బస్సు, లారీ ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఎనిమిది మంది మృతి చెందగా 30 మంది గాయపడ్డారు. ఈ ఘటన కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీని తీవ్రంగా కలిచివేసింది. ఈ ఒక్క ఘటనే కాదు.. నిత్యం జిల్లాలో పలు ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఈ ప్రమాదాల నివారణకు పటిష్ట ప్రణాళిక అమలు చేయాలని కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించారు. రోడ్డు ప్రమాదాలకు అడ్డుకట్ట వేసేందుకు రెవెన్యూ, రవాణా, వైద్య, పోలీసు శాఖల సమన్వయంతో ప్రతివారం సమీక్షలు, ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన అంశాలపై లోతుగా చర్చించి దిశానిర్దేశం చేస్తున్నారు.

- రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట ప్రణాళిక
- ప్రత్యేక దృష్టి సారించిన కలెక్టర్
- ప్రమాదాల నివారణకు కార్యాచరణ
- జిల్లాలో 25 బ్లాక్‌స్పాట్‌ల గుర్తింపు
- క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు



రోడ్డు ప్రమాదాల నివారణపై సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్ (ఫైల్)

చిత్తూరు కలెక్టరేట్ : ప్రాణం విలువ ఎంతో ముఖ్యమైనది. జిల్లాలో నిత్యం ఎక్కడో ఒకచోట రోడ్డు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఈ ప్రమాదాల్లో ఎంతో మంది ప్రాణాలు కోల్పోవడం, గాయాలు కావడం నిత్యం చూస్తూనే ఉన్నాం. అతివేగం, డ్రైవింగ్ నిర్లక్ష్యం వల్ల రోడ్డు ప్రమాదంలో మృతి చెందే వ్యక్తుల కుటుంబాలు చీకటిమయం అవుతున్నాయి. డ్రైవింగ్ అలసత్వం, మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల బతుకులు గాల్లో కలిసిపోతున్నాయి. ఇలాంటి రోడ్డు ప్రమాదాలకు అడ్డుకట్ట వేసేందుకు కలెక్టర్ సుమిత్ కుమార్ ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తున్నారు. నిత్యం జరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై క్షేత్రస్థాయిలో ప్రజలు, యువతకు అవగాహన కల్పించేందుకు చర్యలు చేపడుతున్నారు. నిర్దిష్ట ప్రణాళిక అమలుతో రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు కృషి చేస్తున్నారు.

సహాయం ముఖ్యం

ఒక కుటుంబంలో ఎవరైనా ప్రమాదాల బారినపడి మృతి చెందితే ఆ కుటుంబం సర్వస్వం కోల్పోయి, కుటుంబం రోడ్డున పడాల్సిన పరిస్థితి వస్తుంది. రోడ్లపై నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేసే అలసత్వాన్ని వీడాలి. మానసిక ప్రశాంతతో డ్రైవింగ్ చేయాలి. లైసెన్స్ లేకుండా వాహనం నడపకుండా, హెల్మెట్ ధరించి వాహనాలు నడిపేలా క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. రోడ్డు ప్రమాదాల వల్ల జరిగే నష్టాలను ప్రజలకు అర్థమయ్యే విధంగా తెలియజేస్తున్నారు. ప్రమాదాలు జరిగితే వెంటనే స్పందించేలా అధికారులు, 108 వాహనాలు, డాక్టర్‌లు, పోలీసుల నంబర్‌లను తెలుసుకునేలా అవగాహన కల్పిస్తున్నారు. ఎక్కువ ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో సహాయం నిమిత్తం 108 వాహనాలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపడుతున్నారు.

ప్రమాదాలు జరిగే ప్రాంతాలను బ్లాక్‌స్పాట్‌లుగా..

జిల్లాలో ఎక్కువ ప్రమాదాలు ఎక్కడెక్కడ జరుగుతున్నాయో గుర్తించారు. ఆయా ప్రాంతాలను బ్లాక్ స్పాట్‌లుగా గుర్తించి అవగాహన కల్పిస్తున్నారు. జిల్లాలో 25 ప్రాంతాలను బ్లాక్ స్పాట్‌లుగా గుర్తించి ఆ ప్రాంతాల్లో ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. మితిమీరిన వేగం, మద్యం తాగి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని అవగాహన కల్పిస్తున్నారు. ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో విద్యుత్‌లైట్లు, హైవేలపై వేగ నియంత్రణకు లేజర్ స్పీడ్ గన్స్, వేగాన్ని నియంత్రించేందుకు బ్లాక్‌స్పాట్స్ సమీపంలో రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేశారు. ప్రమాద స్థలం వాహనదారులకు తెలిసేలా పవర్ బ్లింకర్స్,సైన్ బోర్డులు, బారికేడ్లు, సీసీ కెమెరాలు, సోలార్ స్టైన్స్ ఏర్పాటు చేస్తున్నారు.

జిల్లాలో గుర్తించిన బ్లాక్‌స్పాట్‌లు ఇవే..

- ఎన్ హెచ్– 69 రోడ్డులో.. : ఎంఎస్ఆర్ క్రాస్, చీలాపల్లి క్రాస్, గంగాసాగరం వద్ద ఉన్న ఆర్ఎంఎం ఫ్యాక్టరీ , యాదమరి జంక్షన్, వరిగపల్లి జంక్షన్, కేజీ సత్రం, మొగిలి ఘాట్ (శ్రీనీఫ్యాక్టరీ వద్ద), దొర చెరువు (మొగలి ఘాట్), జగమర్ల క్రాస్, దండపల్లి (వి.ఎస్.ఆర్) జంక్షన్, పొన్నమాకులపల్లి క్రాస్, అలకుప్పం (కుక్కలదొడ్డి క్రాస్).
- ఎన్‌హెచ్ 42 రోడ్డు : గొల్లపల్లి క్రాస్, దేవదొడ్డి, కుమ్మరమడుగు క్రాస్, జువనిపల్లి క్రాస్, నాయనపల్లి పెట్రోల్ బంక్, విజలపురం క్రాస్, కె.సి హాస్పిటల్.
- ఎన్‌హెచ్ 40 రోడ్డు : మురకంబట్టు జంక్షన్, ఎన్ హెచ్ 140 లో తెల్లగుండ్ల పల్లి క్రాస్, పి.కొత్తకోట రైల్వే అండర్ బ్రిడ్జి,
- ఎన్‌హెచ్ 716 లో హెచ్‌పీ పెట్రోల్ బంక్, గవర్నమెంట్ ఆసుపత్రి ఎదురుగా, మిట్ట ప్రదేశాలను బ్లాక్ స్పాట్‌లుగా గుర్తించి ప్రమాదాల కట్టడికి చర్యలు చేపడుతున్నారు.

జిల్లాలో డివిజన్‌ల వారిగా గుర్తించిన బ్లాక్‌స్పాట్‌లు

డివిజన్	ఎన్‌హెచ్-69	ఎన్‌హెచ్-42	ఎన్‌హెచ్-140	ఎన్‌హెచ్-40	ఎన్‌హెచ్-716	మొత్తం
చిత్తూరు	7	0	2	2	0	11
పలమనేరు	6	3	0	0	0	09
కుప్పం	0	2	0	0	0	02
నగరి	0	0	0	0	3	03
మొత్తం	13	5	2	2	3	25

25 బ్లాక్‌స్పాట్స్‌లో 2024 సంవత్సరంలో ప్రమాదాలు ఇలా...

లైట్‌వెయిట్ వాహన ప్రమాదాలు	249
ద్విచక్ర వాహనాల ప్రమాదాలు	209
గాయపడినవారు	510 మంది
మృతిచెందిన వారు	228 మంది
ద్విచక్రవాహన ప్రమాదాల్లో మృతులు	128


2025 మార్చి నెల వరకు ప్రమాదాలు ఇలా..

లైట్ వెయిట్ వాహనాల ప్రమాదాలు	53
ద్విచక్ర వాహనాల ప్రమాదాలు	63
గాయపడిన వారు	153 మంది
ప్రమాదాల్లో మృతి చెందినవారు	51 మంది

పాటించాల్సిన నియమాలు

- ట్రాఫిక్, రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలి.
- మద్యం తాగి వాహనాలు నడపరాదు.
- మూల, మలుపుల వద్ద వేగాన్ని తగ్గించాలి.
- వాహనం నడుపుతున్న సమయంలో సెల్‌ఫోన్ వినియోగించకూడదు.
- ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ వినియోగించాలి.
- రోడ్డుపై ప్రయాణించేటప్పుడు పెద్ద వాహనాలకు దూరంగా ఉండాలి.
- కార్లల్లో ప్రయాణించే వారు తప్పనిసరిగా సీట్ బెల్టు వినియోగించాలి.

రేపు ఉడిపి పీఠాధిపతి పాదయాత్ర



ఈషాప్రియ తీర్థస్వామీజీ, ఉడిపి పీఠాధిపతి

పుత్తూరు : గోసంరక్షణ నిమిత్తం ఉడిపి పీఠాధిపతి శ్రీఈషాప్రియ తీర్థ స్వామిజీ నిర్వహిస్తున్న పాదయాత్ర ఈనెల 29వ తేదీ మంగళవారం సాయంత్రం 7 గంటలకు పుత్తూరు చేరుకుంటుంది. స్వామిజీకి స్థానిక ఆర్డీఎం గేటు వద్ద హిందూ సేవా సమితి ఆధ్వర్యంలో స్వాగతం పలకనున్నారు. అక్కడి నుంచి శివాలయం వరకు పాదయాత్ర చేపట్టనున్నట్లు తెలిపారు. 8 గంటలకు స్వామి అనుగ్రహ భాషణం ఉంటుందన్నారు. రాత్రి తడుకు గ్రామంలో బసచేసి, 30 తేదీ ఉదయం 8 గంటలకు అనుగ్రహ భాషణం అనంతరం 10 గంటలకు పాదయాత్ర రేణిగుంట వైపు కొనసాగుతుందని చెప్పారు.

నాటుసారా తాగి గుర్తు తెలియని వ్యక్తి మృతి

రొంపిచెర్ల : నాటు సారా తాగి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన తిరుపతి–మదనపల్లె జాతీయ రహదారిలోని రొంపిచెర్ల–పీలేరు మండలాల సరిహద్దులో ఆదివారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. బండకిందపల్లె పంచాయతీలోని బడబల్ల వంక వద్ద రోడ్డు పక్కన సుమారు (45) ఏళ్ల వయస్సున్న వ్యక్తి మూడు రోజులుగా కమోళ్లపల్లె పక్కన ఉన్న రామానాయక్ తండా– యర్రగుంటపల్లె మధ్య తిరుగుతున్నాడని గ్రామస్తులు తెలిపారు. దుస్తులు లేకుండా డ్రాయర్ మాత్రమే వేసుకొని తిరుగుతున్నాడని చెప్పారు. పీలేరు మండలం రామానాయక్ తండాలో నాటుసారా తాగి అక్కడ నుంచి రోడ్డు పక్కకు వచ్చి మృతి చెంది ఉంటాడని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మధ్యాహ్నం 12.30 గంటలకు రోడ్డు మీద వెళ్తున్న వారు రొంపిచెర్ల పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఎస్ఐ సుబ్బారెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని వివరాలను గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. మృతదేహం ఎడమ చేతిపైన మన్మధ్‌రాజ్ అనే పచ్చ బొట్టుతో పేరు రాసుకున్నాడని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి శవాన్ని పోస్టుమార్టం కోసం పీలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడు తమిళనాడు రాష్టానికి చెంది ఉంటారని అనుమానిస్తున్నారు. మృతదేహం ఆచూకీ తెలిసిన వారు రొంపిచెర్ల పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ సుబ్బారెడ్డి కోరారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

గంగవరం : సొంత పని మీద పలమనేరుకు నడుచుకుంటూ వెళ్తున్న మహిళను ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. ఈ ఘటన మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని కూర్నిపల్లి గ్రామానికి చెందిన గిరిజమ్మ (57) గ్రామం నుంచి పలమనేరుకు నడుచుకుంటూ వెళ్తోంది. ఈ క్రమంలో కూర్నిపల్లి క్రాస్ ఓం శక్తి గుడి వద్ద హైవేలో అటుగా వెళ్తున్న ద్విచక్ర వాహనం ఆమెను ఢీకొంది. ఈ ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలు కాగా స్థానికులు ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం చిత్తూరుకు రెఫర్ చేయగా అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతి చెందినట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థిని అదృశ్యం : కేసు నమోదు

తవణంపల్లె : మండలంలోని ఓ గ్రామానికి చెందిన విద్యార్థిని అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు. మండలంలోని విద్యార్థిని (14) పదో తరగతి పరీక్షలు రాసి ఇంటి వద్ద ఉండేదని వివరించారు. ఈనెల 24వ తేదీన ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు పేర్కొన్నారు. బంధువుల ఇళ్లు, పరిసర గ్రామాల్లో వెతికినా ఆచూకీ కనిపించలేదన్నారు. విద్యార్థిని తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

బంగారుపాళెం : మండలంలోని తగ్గువారిపల్లె సమీపంలో ఆదివారం సాయంత్రం పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. తగ్గువారిపల్లెకు చెందిన రాజన్న మామిడి తోపు సమీపంలో పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ 3,940 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.వారిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

రూ.1.75 కోట్ల విద్యుత్ బిల్లుల వసూలు

చిత్తూరు కార్పొరేషన్ : ఆదివారం విద్యుత్ బిల్లులు చెల్లింపు కేంద్రాలు పనిచేశాయి. దీంతో చిత్తూరు, తిరుపతి జిల్లాలో విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలను తెరిచారు. మొత్తం 12,200 మంది వినియోగదారులు బిల్లులు చెల్లించగా తద్వారా రూ.1.75 కోట్లు వచ్చిందని ట్రాన్స్‌కో ఎస్ఈలు ఇస్మాయిల్ అహ్మద్, సురేంద్రనాయుడు వివరించారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శనివారం అర్ధరాత్రి వరకు 82,811 మంది స్వామివారిని దర్శించుకోగా 34,913 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.24 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

సంక్రాంతిపల్లెలో దొంగల బీభత్సం

- అయిదు ఇళ్లలో చోరీలు
- రెండు ఇళ్లల్లో బీరువాలను దర్జాగా తీసుకెళ్లి దోచుకున్న వైనం
- 81 గ్రాముల బంగారం, రూ .1.80 లక్షల నగదు అపహరణ



సంక్రాంతిపల్లెలో చోరీకి గురైన ఇంట్లో వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీం సభ్యులు

బంగారుపాళెం : మండలంలోని సంక్రాంతిపల్లెలో ఆదివారం అర్ధరాత్రి దొంగలు పడి గ్రామంలోని 5 ఇళ్లల్లో చోరీకి పాల్పడ్డారు. సుమారు 10 లక్షల విలువైన నగలు, నగదు అపహరించుకుపోయారు. రెండిళ్లల్లోని బీరువాలను గ్రామ సమీపంలోకి తీసుకెళ్లి అక్కడ ధ్వంసం చేసి నగలు, నగదు దోచుకుపోవడం గమనార్హం. జాతీయ రహదారికి కూత వేటు దూరంలో గల గ్రామంలో నిందితులు దర్జాగా చోరీకి పాల్పడడం చర్చనీయాంశంగా మారింది. పోలీసులు, గ్రామస్తుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సంక్రాంతిపల్లెలో అర్ధరాత్రి సమయం గుర్తుతెలియని వ్యక్తులు గ్రామానికి చెందిన ఉమేష్, మునిరత్నం, శాంతమ్మ, ఇళ్లతో పాటు దళితవాడలోని మునెయ్య, చిట్టిబాబు ఇళ్లల్లో ఇంటి తాళాలను పగులగొట్టి లోపలికు ప్రవేశించారు. ఉమేష్, మునిరత్నం ఇళ్లలోని బీరువాలను గ్రామ సమీపంలోకి తీసుకెళ్లి అక్కడ పగులగొట్టారు. ఉమేష్ బీరువాలో రూ. 2 లక్షల నగదు, 60 గ్రాముల బంగారు ఆభరణాలు, మునిరత్నంకు చెందిన బీరువాలో రూ.15 వేల రూపాయలు నగదు, 16 గ్రాముల బంగారు నగలు అపహరించారు. శాంతమ్మ ఇంటిలో పెట్టెలను పగులగొట్టి చూశారు. ఏమీ లేకపోవడంతో వెళ్లిపోయారు. దళితవాడలో మునెయ్య ఇంటిలో రూ.2 వేల రూపాయల నగదు, బంగారు కమ్ములు(జత) రెండు గ్రాములు, చిట్టిబాబు ఇంట్లో మూడు గ్రాముల విలువైన మూడు జతల కమ్మలు, 2,500 రూపాయల నగదు దోచుకుపోయారు. తెల్లవారుజామున 3.30 గంటల సమయంలో గ్రామానికి చెందిన మోహన్ టిఫిన్ దుకాణం నిర్వహించేందుకు ఇంటి నుంచి బయటకు రావడంతో నలుగురు వ్యక్తులు ఉమేష్ ఇంటి వద్ద ఉండడంతో కేకలు వేయడంతో దొంగలు పారిపోయినట్లు తెలిపారు. చోరీ సమాచారం అందుకున్న బంగారుపాళెం సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ రమేష్, సిబ్బంది సంక్రాంతిపల్లె గ్రామానికి చేరుకున్నారు. చోరీకి గురైన ఇళ్లను పరిశీలించారు. బాధితులతో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. మిట్టపల్లె గ్రామంలో మహాభారత కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న హరికథకు స్థానికులు వెళ్లినట్లు తెలిపారు. ఉమేష్, మునిరత్నం ఇళ్లకు తాళాలు వేసుకుని మిద్దెపైన నిద్రపోయినట్లు తెలిపారన్నారు. సంఘటనా స్థలాన్ని పలమనేరు డీఎస్పీ ప్రభాకర్ సందర్శించారు. చిత్తూరు నుంచి క్లూస్‌టీమ్ సభ్యులు చోరీ జరిగిన ఇళ్లలో వేలి ముద్రలను సేకరించారు. కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు.

విద్యార్థి మృతదేహంతో ఆందోళన

- కళాశాల వద్ద కుటుంబీకుల ధర్నా
- రోడ్డుపై బైఠాయించి నిరసన
- కళాశాల యాజమాన్యమే చంపేసిందని ఆరోపణ
- రాత్రి వరకూ కళాశాల వద్ద ఉద్రిక్త వాతావరణం



కళాశాల వద్దకు విద్యార్థి మృతదేహంతో వెళుతున్న కుటుంబీకులు



కళాశాల ఎదుట గుమికూడిన బాధితుల బంధువులు

గంగవరం : మా బిడ్డ కళాశాలలో ఆత్మహత్య చేసుకున్నాడా లేక చంపేశారా.. కళాశాల యాజమాన్యమే సమాధానం చెప్పాలి.. లేకపోతే ఇక్కడ నుంచి కదిలేది లేదంటూ కళాశాలలో ఉరేసుకుని అనుమానాస్పదంగా మృతి చెందిన ఇంటర్ విద్యార్థి కుటుంబికులు, బంధువులు కలిసి కళాశాల ఎదుట రోడ్డుపై ధర్నా చేశారు. కుటుంబ సభ్యుల కథనం మేరకు వివరాలు ఇలా.. కుప్పం వద్ద శాంతీపురం మండలం గెసికపల్లి గ్రామానికి చెందిన సుబ్రమణ్యం కుమారుడు యోగేష్(16) గంగవరం మండలంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతూ ఈ మధ్య వెలువడిన ఫలితాల్లో ఫెయిల్ అయ్యాడు. అయితే గత 23వ తేదీన సప్లిమెంటరీ పరీక్షలకు ప్రిపేర్ కావడం కోసం అతన్ని తల్లిదండ్రులు కళాశాలలో విడిచి వెళ్లారు. శనివారం రోజున కళాశాలలోని ఇంజినీరింగ్ విద్యార్థి ఉంటున్న హాస్టల్ గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకున్నట్లుగా శవమై కనిపించడంపై పలు అనుమానాలకు దారి తీసింది. విద్యార్థి మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టం కోసం పలమనేరు ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

6 కి.మీ మృతదేహాన్ని ఎత్తుకొని నడుచుకుంటూ..

పోస్టుమార్టం ముగిసిన తరువాత ఆదివారం విద్యార్థి మృతదేహాన్ని చేతుల్లో మోసుకుంటూ దాదాపు 6 కిలో మీటర్లు రోడ్డు మార్గాన నడుచుకుని కళాశాల వద్దకు చేరుకున్నారు. అక్కడ మృతదేహంతో రోడ్డుపై బైఠాయించి తమకు న్యాయం చేయాలంటూ నిరసన చేపట్టారు. పలమనేరు డీఎస్పీ ప్రభాకర్, గంగవరం, పలమనేరు సీఐలు ప్రసాద్, నరసింహరాజు, భాస్కర్ అక్కడికి చేరుకుని మృతుడి కుటుంబికులకు సర్ది చెప్పాలని చూసినా వారు వినలేదు. తమ బిడ్డను కళాశాల యాజమాన్యం చంపేసి నిజాలను దాచిపెడుతున్నారని వాపోయారు. పదుల సంఖ్యలో పోలీసులు , బెటాలియన్‌తో కలిసి అక్కడ గుమికూడిన విద్యార్థి కుటుంబికులను కళాశాలలోనికి అనుమతించకుండా అడ్డుకున్నారు. దీంతో కళాశాల ఎదుట ఉద్రిక్త వాతావరణం నెలకొంది. చాలాసేపు తరువాత మృతుడి కుటుంబికులకు, కళాశాల యాజమాన్యానికి మధ్యన పోలీసులు రాజీ కుదర్చడంతో మృతదేహంతో అక్కడి నుంచి వెనుదిరిగారు.

దళితుల దాడులపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు

–బహుజన సేన రాష్ట్ర అధ్యక్షుడు చందు



మాట్లాడుతున్న బహుజన సేనరాష్ట్ర నాయకులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : రాష్ట్రంలో దళితుల దాడులపై హోం మంత్రి, డీజీపీకి చిత్తశుద్ధిలేదని బహుజన సేన రాష్ట్ర అధ్యక్షుడు చందు మండి పడ్డారు. చిత్తూరులోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. గుట్టు చప్పుడు కాకుండా 98 మంది ఎస్సీ, ఎస్టీ స్పెషల్ పోలీస్ స్టేషన్‌ల డీఎస్పీ పోస్టింగ్‌లను ప్రభుత్వం రద్దు చేసిందని ఆయన ఆరోపించారు. ఈ స్పెషల్ డీఎస్పీల వ్యవస్థను ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టాన్ని బలపరచడానికి, ఎస్సీ, ఎస్టీ బాధితుల వర్గానికి మెరుగైన సత్వర న్యాయాన్ని అందించడానికి జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫారసుల ద్వారా 2014వ సంవత్సరంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సమస్యను పరిష్కారం చేయకుండా, చట్టాన్ని నీరు గార్చేవిధంగా ప్రభుత్వం వ్యవహరిస్తే తప్పకుండా తిరుగుబాటు ఉద్యమం తప్పదని హెచ్చరించారు. మే 5వ తేదీన చలో విజయవాడ మహాధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. బహుజన సేన రాష్ట్ర కార్యదర్శి గోవిందప్ప, చిత్తూరు జిల్లా అధ్యక్షుడు సతీష్, ఉపాధ్యక్షులు కుమార్, హరివర్ధన్, బాలు, భాస్కర్ పాల్గొన్నారు.

